క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప భక్తుల పేటతుళ్లి



తిమ్మరాజుపేటలో పేటతుళ్లిఆడుతున్న అయ్యప్ప భక్తులు

మునగపాక : తిమ్మరాజుపేటలో ఆదివారం పేటతుళ్లి కార్యక్రమం ఘనంగా జరిగింది. అయ్యప్ప మాలలు ధరించిన 60 మంది భక్తులు కేరింతలు కొడుతూ అయ్యప్పస్వామి నినాదాలు చేస్తూ పేటతుళ్లి ఆడారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి పలు వీధుల గుండా పేటతుళ్లి నిర్వహించారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి



వేడుకల్లో పాల్గొన్న దివ్యాంగులు

చీడికాడ: దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి చేస్తామని వికలాంగు హక్కుల పోరాట సమితి మాజీ అధ్యక్షుడు మతల అప్పలనాయుడు తెలిపారు. దివ్యాంగుల దినోత్సవాన్ని ఖండివరంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సు పాసులకు అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీరిందరి పాసులు జారీ అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో హక్కుల పోరాట సమితి నేతలు వి.శ్రీను, లెక్కల గోవింద పాల్గొన్నారు.

చర్చిల్లో క్రిస్మస్ సందడి



ఎల్.బి.పురం చర్చి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్

బుచ్చెయ్యపేట: మండలంలో పలు గ్రామాల్లో చర్చిలు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని బుచ్చెయ్యపేట, వడ్డాది మేజరు పంచాయతీ, ఎల్.బి. పురం, దిబ్బిడి, రాజాం, సీతయ్యపేట, తురకలపూడి, మంగళాపురం, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో చర్చిలకు రంగులు వేసి భారీ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. రంగు రంగుల క్రిస్మస్ స్టార్స్ అలంకరిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల చర్చిల్లో క్రిస్మస్ ఫెలోషిప్ పేరుతో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.


నేడు సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజలు



కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామివారు

మాడుగుల రూరల్: సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఉపాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి సోమవారం ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు ఆదివారం తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు 108 తమలపాకులు, తేనె, నెయ్యి, కొబ్బరికాయ, అరటిపండ్లు, హారతి తీసుకుని రావాలని కోరారు.

పెద్దేరుకు తగ్గిన ఇన్‌ఫ్లో



పెద్దేరు జలాశయం

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయంలోకి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు, శుక్రవారం నాటికి 136.55 మీటర్లకు చేరింది. నాలుగు రోజులు క్రితం వరకు జలాశయంలోకి వెయ్యి క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరేది. ప్రస్తుతం 300 క్యూసెక్కులు మాత్రమే వచ్చి చేరుతుండడంతో అంతే వరద నీరు జలాశయం అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

అన్నదాతకు ఆత్మీయ నేస్తాలు

మండలంలో ఆర్‌బీకేలు : **18**

భవనాల నిర్మాణం పూర్తయినవి : **13**

ఒక్కో ఆర్‌బీకేకు వ్యయం : రూ. **23** లక్షలు





అధునాతనంగా ఉన్న రైతు భరోసా కేంద్రం



ఆర్బీకేలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

- రైతులకు కొండంత అండగా ఆర్‌బీకేలు
- విత్తనాల నుంచి వ్యవసాయ పరికరాల వరకూ సరఫరా
- పంటల బీమా, ఈ క్రాప్ నమోదు, కౌలు రైతుల గుర్తింపు
- సేవలతో రైతులకు పూర్తి భరోసా

కోటవురట్ల : అన్నదాతలకు ప్రభుత్వం కొండంత అండగా ఉంది. రైతు కళ్లల్లో సంతోషాన్ని చూడాలన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతులను ఎన్నో విధాలుగా ఆదుకుంటూ కొండంత భరోసా ఇస్తున్నారు. రైతు భరోసాతో పెట్టుబడి సాయంతో మొదలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, పంట నష్టం వరకు అందిస్తూ ప్రభుత్వం రైతుకు ధైర్యాన్ని కల్పిస్తూ ఆసరాగా ఉంటోంది. రైతు భరోసా కేంద్రాలతో రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. ఈ కేంద్రాలు రైతులకు నేస్తాలుగా మారాయి. రైతుకు సంబంధించిన సమస్త సేవలు ఈ కేంద్రాల ద్వారా ప్రతీ రైతుకు పారదర్శకంగా అందుతున్నాయి. గతంలో మాదిరి రైతుకు వ్యయ ప్రయాసలు లేవు. విత్తనాల కోసం పడిగాపులు లేవు. ఎండలో అవస్థలు అసలే లేవు. ఎరువుల కోసం ఇబ్బంది లేదు. ఇపుడు సమస్త సేవలు ఆర్బీకేలలో లభ్యమవుతూ రైతును సాగు కోసం ప్రోత్సహిస్తున్నాయి. కియోస్కు మెషిన్‌లో రైతుకు కావలసిన ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అన్ని రాయితీపై సకాలంలో అందుతున్నాయి. మండలంలో 25 గ్రామ పంచాయతీలకు 19 గ్రామ సచివాలయాలు, 18 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో రైతు భరోసా కేంద్రాన్ని రూ.23 లక్షలతో అత్యాధునికంగా నిర్మించారు. ప్రస్తుతం 13 కేంద్రాలు నిర్మాణాలు పూర్తి చేసుకోవడంతో పాటు సేవలు అందిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో 1560 హెక్టార్లలో వరిసాగు జరిగింది. అగ్రికల్చర్, హార్టీకల్చర్ కలిపి 5900 హెక్టార్లలో జరిగిన పంటకు వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ క్రాప్ నమోదు చేశారు. మండలంలో 265 మంది కౌలు రైతులను గుర్తించారు. మిచాంగ్ లాంటి తుపాను బీభత్సం సృష్టించి పంటలను నాశనం చేసినా ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్క రైతు నష్టపోకూడదు, వేదన చెందకూడదనే భావనతో జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు బాసటగా నిలవాలని, మానవత్వాన్ని చాటాలని ఆదేశాలు ఇచ్చారు. దీని ప్రకారం ఏ రైతు కూడా నష్టపోకూడదనే అధికారులు మానవతా దృక్పథంతో పంట నష్టాన్ని అంచనా వేశారు. వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం మండలంలో 1198 హెక్టార్లలో పంట నష్టపోయినట్టు గుర్తించారు. ఇలా ఆర్బీకేలా ద్వారా విత్తు నుంచి నష్టం వరకు రైతుకు అండగా ఉంటున్నారు.



పీఎం కిసాన్ ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది



ఆర్బీకేలో కియోస్క్ ద్వారా రైతులకు సేవలందిస్తున్న సిబ్బంది

సాగుపై ప్రేమ పుట్టింది..



మాది యండపల్లి, నా పేరు గొర్లి నానిబాబు. మాది వ్యవసాయ కుటుంబం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయంపై ఆశలు చచ్చిపోయాయి. సకాలంలో వర్షాలు లేకపోవడంతో పాటు విత్తనాలు, ఎరువుల కోసం నానా పాట్లు పడేవాళ్లం. క్యూలో నిలుచుని తోపులాడుకునేవాళ్లం. చివరకు నాణ్యమైన విత్తనాలు దొరికేవి కావు. దాంతో వ్యవసాయం మాని వేరే వ్యాపారం చూసుకున్నా. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రైతులకు ఎంతో ప్రోత్సాహం వచ్చింది. రైతు భరోసా కేంద్రాలు మా జీవితాలను మార్చేశాయి. రైతును మళ్లీ నిలబెట్టినందుకు ముఖ్యమంత్రి జగనన్నకు ఎపుడూ రుణపడి ఉంటాం. – గొర్లి నానిబాబు, రైతు, యండపల్లి

ఆశలు చిగురించాయి..



మాది నీలిగుంట గ్రామం. నాపేరు భజన సీతయ్య. నాకు వ్యవసాయం అంటే విపరీతమైన పిచ్చి. నాకున్న మూడెకరాల భూమితో పాటు ఇంకా కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటా. టీడీపీ ప్రభుత్వంలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారు. నేను చాలా నష్టపోయాను. వ్యవసాయం అంటే చిరాకు పుట్టింది. ఇక చేతులెత్తేసే సమయంలో జగనన్న మళ్లీ సాగుపై ఆశలు పుట్టించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సమయానికి విత్తనాలు అందుతున్నాయి. ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వ్యవసాయ పనిముట్లు రాయితీపై ఇస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, ప్రోత్సాహం ఉంటోంది. ఇంతకంటే రైతుకు ఇంకేం కావాలి.
– భజన సీతయ్య, రైతు, నీలిగుంట

ఆర్బీకేల సేవలతో రైతులు సంతృప్తిగా ఉన్నారు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్బీకేలు రైతులకు నేస్తాలుగా మారాయి. గ్రామ స్థాయిలోనే సమస్త సేవలు రైతులకు అందుతున్నాయి. వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలతో పాటు ప్రోత్సాహం ఇస్తున్నాం. గతంలో కంటే ఇపుడు రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఆర్బీకేల సేవలతో రైతులు సంతృప్తి చెందుతున్నారు. తుపాను నష్టం కూడా రైతులకు భారం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.
– భీమిరెడ్డి సరోజిని, మండల వ్యవసాయాధికారి

ఆకట్టుకుంటున్న లైటింగ్ బోర్డులు

- మా నమ్మకం నువ్వే జగన్ నినాదంతో ప్రచారం
- షాపుల వద్ద ఏర్పాటు
- అభిమానులకు వైఎస్సార్‌సీపీ సరఫరా

నక్కపల్లి : మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో తయారు చేసిన లైటింగ్ బోర్డులు ఆకట్టుకుంటున్నాయి. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలకు తమ షాపుల వద్ద, ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకునేందుకు పార్టీ అధిష్టానం ఈ లైటింగ్ బోర్డులను ఉచితంగా సరఫరా చేస్తోంది. ఆదివారం ఈ బోర్డుల్లో కొన్ని నక్కపల్లి మండల కేంద్రానికి వచ్చాయి. వీటిని జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కిరాణా, పాన్‌షాపులు, కాఫీహోటళ్లు , వాణిజ్య సంస్థ వద్ద ఏర్పాటు చేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఈ లైటింగ్ బోర్డులను పార్టీ అభిమానులకు వీటిని అందజేశారు. స్వయంగా షాపుల వద్ద ఏర్పాటు చేయించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో పాటు ఫ్యాన్ గుర్తుతో లైట్లతో తయారు చేసిన ఈ బోర్డులు వెలుగులు విరజిమ్ముతూ ఆకర్షిస్తున్నాయి. మండలానికి మరో 100 బోర్డులు కావాలని ఆర్డర్ పెట్టినట్లు వీసం తెలిపారు. ఈ బోర్డులు షాపుల వద్దే కాకుండా ఇళ్ల వద్ద కూడా ఏర్పాటు చేసుకునేందుకు ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసంనానాజీ, ఉపసర్పంచ్ వీసం రాజు, వార్డు సభ్యులు అల్లాడ కొండ, వైఎస్సార్‌సీపీ నాయకులు తూము అప్పారావు, తూము దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



పార్టీ సరఫరా చేసిన లైటింగ్ బోర్డులు షాపుల వద్ద ఏర్పాటు చేయిస్తున్న వీసం

కొడవటిపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్

కోటవురట్ల : కొడవటిపూడిలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులను కలుసుకుని సంక్షేమ లబ్ధిని వివరిస్తారని తెలిపారు. నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

ముమ్మరంగా వరి నూర్పులు



యండపల్లిలో వరినూర్పు చేస్తున్న రైతులు

కోటవురట్ల: మిచాంగ్ చేసిన గాయం నుంచి రైతులు తేరుకోలేకపోతున్నారు. తుపాను పోయి వారం రోజులు గడిచినా నేటికీ వరిచేలల్లో నీరు మాత్రం తొలగిపోలేదు. ఇంకా వరి చేలు ముంపులోనే ఉన్నాయి. ఆరుదల పెట్టిన చోట రైతులు నూర్పులు నిర్వహిస్తున్నారు. నీటిలో నానిన వరి పనలను నూర్పుడు యంత్రాలతో గింజలను వేరు చేస్తున్నారు. ప్రభుత్వం పంట నష్టం గుర్తింపులో ఉదారంగా వ్యవహరించడంతో రైతులు కోలుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం పలు గ్రామాలలో వరి నూర్పులు జోరుగా సాగుతున్నాయి.

పల్లెల్లో అభివృద్ధికి పెద్ద పీట

మునగపాక : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాలన సాగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ అన్నారు. మునగపాకలో ఆదివారం రూ.10 లక్షల తన కోటా ద్వారా మంజూరైన నిధులతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సేవలందిస్తున్నారన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పార్టీ నేతలు పిల్లి అప్పారావు, ఇంటి శ్రీను పాల్గొన్నారు.



మునగపాకలో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

160 మందికి ఉచిత వైద్య సేవలు

ఎస్.రాయవరం: గ్రామాల్లో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలకు విశేష ఆదరణ వస్తుంది. గడిచిన కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న వైద్య శిబిరం ఈ ఆదివారం అడ్డురోడ్డు ప్రజా వైద్యశాలలో వైద్య శిబిరం నిర్వహించారు.బంగారయ్యచారిటబుల్ ద్వారా అందిస్తున్న వైద్యం గ్రామాల్లో నిరుపేద కుటుంభాలు సద్వినియోగపరుచకుంటున్నారు. మేరకు ఆదివారం వైద్య శిబిరానికి సుమారు 160 మంది రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కేజీహెచ్ మాజీ ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పాయకరావుపేట నియోజకవర్గంలో కోటవురట్ల, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల వారు ఈ వైద్య సేవలను ఉపయోగించుకుంటున్నారు.



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ బంగారయ్య

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని చేరుకోవాలనే...

కోటవురట్ల: పిల్లలకు బంగారు భవిష్యత్‌ను ఇచ్చేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు అనుభవజ్ఞుల సలహాలు ఎంతో అవసరం..ఉన్నత జీవితాన్ని పొందేందుకు చదువులో కెరీర్ గైడెన్సు కీలకం. సమయానుసారం పిల్లల్లో స్ఫూర్తితో పాటు ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. సరైన కెరీర్ గైడెన్సు లేక తెలివైన పిల్లలు కూడా పక్కదారి పట్టే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతంలో చదివే పిల్లలకు సరైన సలహాలు అందక లక్ష్యాన్ని చేరుకోలేక చతికిలపడిన పరిస్థితులు ఉంటాయి. ఏ విద్యార్థి కూడా అలా కాకూడదనే ఉద్దేశ్యంతో రాజుపేటకు చెందిన సూరిశెట్టి సత్యనారాయణ చదువుల పండగ పేరుతో పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. రైల్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న సత్యనారాయణ విశాఖలో ఉంటూ సమైఖ్య అనే ఒక ఆర్గనైజేషన్‌ను స్థాపించారు. దీని ద్వారా తొలుత తన స్వగ్రామం అయిన రాజుపేటలో సేవలు ప్రారంభించారు. మిగతా గ్రామాలకు విస్తరింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి విద్యార్థి కెరీర్ నిర్మాణంలో ఉన్నత స్థాయికి ఎదిగేలా సలహాలు, ప్రోత్సాహం అందించడంతో పాటు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నారు. బాగా చదివే పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు కూడా ప్రోత్సాహం అందిస్తూ కెరీర్ గైడెన్సు ఇస్తున్నారు. తాజాగా రాజుపేట ఎంపీయూపీ స్కూల్లో చదువుల పండగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మోటివేషన్ కలిగించారు. టాప్ 3, వివిధ విభాగాల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు, ఎన్ఎంఎంఎస్‌లో ర్యాంకర్లకు బహుమతులు అందజేశారు. వారికి విలువైన స్వామి వివేకానంద రచనలను అందించారు.



రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో చదవులు పండుగ కార్యక్రమంలో సత్యనారాయణ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలు



మూలపేట గంగాలమ్మ తల్లి గుడి ఆవరణలో పూర్వ విద్యార్థులు



నల్లమారమ్మ గుడి ఆవరణలో పూర్వ విద్యార్థులు

మునగపాక : మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. కార్తీకమాసం పూర్తయిన సందర్భంలో పలువురు పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సందడి చేశారు. 1994–95లో మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు సమీపంలోని పాటిపల్లి నల్లమారమ్మ గుడి ఆవరణలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా మేఘాలయలో మిలటరీలో అమాల్దర్‌గా విధులు నిర్వహిస్తున్న పెంటకోట పట్టాభిని సత్కరించారు. కర్రి భాస్కరరావు, డాక్టర్ రవి, దొడ్డి వెంకటరమణ, మళ్ల పరదేశినాయుడు, భీశెట్టి లక్ష్మణరావు, యల్లపు మోహన్ పాల్గొన్నారు. అలాగే 1975–76లో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు మూలపేటలోని గంగాలమ్మ తల్లి గుడి ఆవరణలో కలుసుకున్నారు. ఏవీ సత్యనారాయణ,సత్యనారాయణ, పెంటకోట వెంకట్,కబడ్డి శివ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



హరిపాలెం ఉన్నత పాఠశాలలో సమావేశమైన1997-98 బ్యాచ్ విద్యార్థులు

హరిపాలెం పాఠశాలలో...

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.1997–98లో పదో తరగతి చదివిన ఈ విద్యార్థులు చిన నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.25 ఏళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసిన ఈ బ్యాచ్ విద్యార్థులు ఇక్కడ చిన్నపిల్లల్లా గడిపారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



మూలపేటలో ధనుర్మాసంలో భాగంగా మేలుకొలుపు ప్రారంభం



భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి

మునగపాక : మండల వ్యాప్తంగా ఆదివారం మేలుకొలుపులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ధనుర్మాసం ప్రారంభంలో భాగంగా పలు దేవాలయాల నుంచి మేలు కొలుపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెల రోజుల పాటు ప్రత్యేక సేవలు, భజనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎస్.రాయవరం : మండలంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. దార్లపూడి శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి, వమ్మవరం శ్రీ స్వయంభూ వేంకటేశ్వరస్వామి, కొరుప్రోలు శ్రీ సీతారామస్వామి, ఎస్.శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఈ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. నెలరోజుల పాటు తిరుప్పావై పాసురాలు చదివి రోజు వారి పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.

రాంబిల్లి: దిమిలిలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణ స్వామి వార్లను నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, నేతేటి గోపాలకృష్ణ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సంక్రాంతి వరకు ఈ పూజలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు.

సీనియర్ పెన్షనర్లకు ఘన సత్కారం



సీనియర్ పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం: ప్రభుత్వ పెన్షనర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో పెన్షనర్స్ డే నిర్వహించారు. అసోసియేషన్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షురాలు గజ్జలమ్మ మాట్లాడుతూ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసుకవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం జాప్యం చేయకుండా సకాలంలో పెన్షన్ చెల్లించాలన్నారు.

మాకవరపాలెం: పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నర్సీపట్నం ఉప కోశాధికారి గణేష్ అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని తామరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని సూచించారు. మండల పెన్షన్‌దారుల సంఘ కార్యదర్శి రంగరాజు మాట్లాడుతూ పెన్షన్‌దారులంతా సమష్టిగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.